సాక్షి
పశ్చిమగోదావరి
గురువారం । 7 । డిసెంబర్ । 2023



తమలపాకుల పూజ
జంగారెడ్డిగూడెం రూరల్: మద్ది ఆంజనేయ స్వామి క్షేత్రంలో కార్తీక మాస మహోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామికి తమలపాకులతో ప్రత్యేక పూజలు చేశారు.



ఉద్యాన పంటలకు నష్టం
తుపాను కారణంగా జిల్లాలో ఉద్యాన పంటలకు సుమారు రూ.2.55 కోట్ల నష్టం వాటిల్లినట్లు అధికారుల అంచనా వేశారు. 8లో ▸



ఆపద వేళ.. ఆపన్నహస్తంలా..
విపత్తు ఏదైనా సేవకు నిదర్శనంగా నిలుస్తున్నారు వలంటీర్లు. తుపాను వేళ హోరుగాలి, జోరువానలోనూ ప్రజలకు అండగా ఉంటూ నష్టనివారణకు తోడ్పడ్డారు. 8లో ▸

గండం గడిచింది

- ముందస్తు జాగ్రత్తలతో తప్పిన ముప్పు
- ఉపశమన చర్యల్లో అధికార యంత్రాంగం నిమగ్నం
- రైతులు, తుపాను బాధితులకు అండగా సహాయక చర్యలు
- నష్టం అంచనాల తయారీలో అధికారులు



పెనుగొండ: వడలిలో ధాన్యం ఒబ్బిడి చేసుకుంటున్న రైతులు

సాక్షి, భీమవరం: మూడు రోజుల పాటు గడగడలాడించిన మిచాంగ్ గండం గడిచింది. విపత్తు సృష్టించిన విలయం నుంచి సాధారణ పరిస్థితులు నెలకొల్పే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నారు. పునరావాస కేంద్రాల్లోని బాధితులకు ప్రభుత్వ సాయం అందించడంతో పాటు పంట నష్టం నుంచి రైతులను గట్టెక్కించేందుకు చర్యలు చేపట్టారు.

మిచాంగ్ తుపాను జిల్లాను వణికించిన విషయం విధితమే. ప్రభుత్వ ఆదేశాలతో అప్రమత్తమైన జిల్లా యంత్రాంగం ముందస్తు చర్యలతో ప్రాణ, ఆస్తి నష్టం నివారించడంలో సఫలీకృతులయ్యారు. తుపాను ప్రభావిత మండలాలైన నరసాపురం, మొగల్తూరు, పాలకొల్లు తదితర తొమ్మిది మండలాల పరిధిలో 28 పునరావాస కేంద్రాలను ఏర్పాటుచేసి 5300 మంది బాధితులను తరలించారు. వారికి అవసరమైన తాగునీరు, ఆహారం, వైద్య సంబంధిత వసతులు కల్పించారు. రైతులు నష్టపోకుండా ఆఫ్‌లైన్ ద్వారా కళ్లాల్లో ఉండిపోయిన 23,500 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లులకు చేరవేశారు. బుధవారం వర్షం తెరిపినివ్వడంతో సాధారణ పరిస్థితులు నెలకొల్పేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

ప్రత్యేక కార్యాచరణ మేరకు సహాయక చర్యలు

బుధవారం కలెక్టరేట్‌లో వివిధ శాఖలకు సంబంధించి జిల్లా ఉన్నతాధికారులతో కలెక్టర్ పి.ప్రశాంతి సమావేశమై రానున్న మూడు రోజుల్లో చేపట్టాల్సిన ప్రత్యేక కార్యాచరణపై ఆదేశాలిచ్చారు. ఈ నేపథ్యంలో తుపాను ప్రభావిత పట్టణాలు, మండలాల్లో వ్యాధులు ప్రబలకుండా క్లోరినేషన్, ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టారు. వైద్య శిబిరాల ఏర్పాటు ద్వారా డెంగ్యూ, మలేరియా పరీక్షలతో పాటు ఫీవర్ సర్వే నిర్వహణకు జిల్లా వైద్యాధికారులు ఏర్పాట్లు చేశారు. పునరావాస కేంద్రాల్లో తలదాచుకున్న ఒక్కో కుటుంబానికి రూ.2500 చొప్పున ప్రభుత్వం మంజూరు చేసిన సాయం పంపిణీకి రెవెన్యూ, సివిల్ సప్లయిస్ అధికారులు చర్యలు చేపట్టారు. ప్రతి కుటుంబానికి 25 కేజీల బియ్యం, కేజీ కందిపప్పు, లీటరు పామాయిల్, కిలో ఉల్లిపాయలు, కిలో బంగాళదుంపలతో కిట్లను సిద్ధం చేస్తున్నారు. పశువులకు వ్యాధులు సోకకుండా వ్యాక్సినేషన్ చేయనున్నారు. వివిధ శాఖల సిబ్బందితో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన ర్యాపిడ్ యాక్షన్ ఫోర్సు బృందాలు నేలకొరిగిన విద్యుత్ లైన్లు, చెట్లను తొలగించి సరఫరా పునరుద్ధరించి పరిస్థితిని చక్కదిద్దుతున్నారు.

అన్నదాతలకు అండగా..

జిల్లాలోని 33,277 ఎకరాల్లోని వరి పంట, 914 ఎకరాల్లోని ఇతర పంటలు తుఫానుకు దెబ్బతిన్నట్టు అధికారులు గుర్తించారు. ఏ ఒక్క రైతుకు నష్టం జరగకూడదన్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రైతులకు అన్ని విధాల అండగా చర్యలు చేపట్టారు. ధాన్యం కొనుగోలు వేగవంతానికి సివిల్ సప్లయిస్ అధికారులకు కలెక్టర్ ఆదేశాలిచ్చారు. డ్వామా పీడీ ఎస్‌టీవీ రాజేశ్వరరావు వ్యవసాయ సహాయక చర్యల్లో ఉపాధి కూలీల వినియోగానికి చర్యలు చేపట్టారు. వెయ్యి ఎకరాల్లోని ముంపు నీరు బయటకు పోయేలా పొలాల్లో బాటలు చేసి, పంట బోదుల్లో పూడికతీత చేశారు. కళ్లాలోని నాలుగువేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఆర్‌బీకేల ద్వారా మిల్లులకు తరలించారు. యుద్ధప్రాతిపదికన పొలాల్లోని ముంపునీరు లాగేందుకు కాలువలు, డ్రైన్లలో జేసీబీలతో పూడిక తొలగింపు పనులు చేపట్టారు.

తుపానును సమర్థంగా ఎదుర్కొన్నాం



జిల్లా అధికారి యంత్రాంగం అనుక్షణం అప్రమత్తంగా పని చేయడంతో తుపానును సమర్థవంతంగా ఎదుర్కొన్నాం. ప్రాణనష్టం జరగకుండా పునరావాస కేంద్రాలకు తరలించి అన్ని సౌకర్యాలు కల్పించేలా కలెక్టర్ చర్యలు తీసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా పర్యటించి వర్షాలకు దెబ్బతిన్న పంటలను, పొలాలు పరిశీలించి వారి ధైర్యం చెప్పి ధాన్యం సంరక్షణ చర్యలు చేపట్టాం.

– కె.కన్నబాబు, తుపాను ప్రత్యేక అధికారి

పునరావాస కేంద్రాలు కొనసాగిస్తున్నాం



జిల్లాలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను బుధవారం కూడా కొనసాగించాం. సహాయక చర్యల్లో భాగంగా విద్యుత్ పునరుద్ధరణ పనులు, ముంపునీరు బయటకు పంపడానికి టీంలు ఏర్పాటు చేశాం. శానిటేషన్ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఎర్రకాలువ, యనమదుర్రు డ్రెయిన్లకు వస్తున్న నీరు గమనించేలా ఇరిగేషన్ అధికారుల్ని అప్రమత్తం చేశాం.

– పి.ప్రశాంతి, జిల్లా కలెక్టర్



ఆకివీడు శిబిరంలో భోజనాలు పెడుతున్న దృశ్యం



ఆకివీడు మండలంలో విద్యుత్ పునరుద్ధరణ పనులు



భీమవరం మండలంలో సహాయక చర్యల్లో పోలీసులు

సహాయక చర్యలు వేగవంతం

భీమవరం(ప్రకాశం చౌక్): తుపాను ప్రభావం ఎక్కువగా నర్సాపురం, మొగల్తూరుతో పాటు ఇతర మండలాల్లోని పునరావాస కేంద్రాల్ని కొనసాగిస్తున్నారు. బుధవారం బాధితులకు భోజనం సౌకర్యం కల్పించారు. మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశారు. మొగల్తూరు, నర్సాపురం మండలాల్లోని పశువులను నర్సాపురం మార్కెట్ యార్డ్, మొగల్తూరు బర్రెల దొడ్డికి తరలించారు. వాటికి పశుగ్రాసం ఏర్పాటు చేశారు. తుపాను సహాయక చర్యల్లో పోలీసులు సమర్థవంతంగా పనిచేశారు. ఎస్పీ జిల్లా వ్యాప్తంగా 500 మంది పోలీసు సిబ్బందిని సహాయక చర్యలకు నియమించారు. 30 మంది స్పెషల్ పార్టీ సిబ్బందిని ఉపయోగించారు. ఇరిగేషన్, రెవెన్యూ, అగ్రికల్చర్ అధికారులను టీంగా ఏర్పాటు చేసి వర్షపు నీరు పొలాల నుంచి వేగంగా బయటకు పంపించడానికి 20 యంత్రాలను ఏర్పాటు చేశారు. విద్యుత్ స్తంభాలు పడిపోవడం, తీగలు తెగిపోవడం కారణంగా జిల్లాలోని 61 గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. బుధవారం విద్యుత్ శాఖ అధికారులు వేగంగా విద్యుత్ పునరుద్ధరణ పనులు చేపట్టారు.

పారిశుధ్య పనులు వేగవంతం

జిల్లాలోని అన్ని పంచాయతీల్లో బుధవారం శానిటేషన్ పనులు చేపట్టారు. భీమవరం, నర్సాపురం డివిజన్లలోని పంచాయతీల్లో శానిటేషన్ కోసం బ్లీచింగ్ 55,765 కిలోలు, బొగ్గు 1,01,630, సోడియం క్లోరైడ్ 1652 లీటర్లు, ఫినాయిల్ 2122 లీటర్ల చొప్పున సరఫరా చేశారు.



పోడూరు మండలంలో ఉపాధి కూలీలతో ముంపు తొలగింపు చర్యలు

న్యూస్‌రీల్

సమ సమాజ స్థాపకుడు అంబేడ్కర్



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: బీఆర్ అంబేడ్కర్ సమసమాజ స్థాపకుడిగా చిరస్థాయిగా నిలిచిపోతారని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో బుధవారం అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా పాలన అందిస్తున్నారన్నారు. వలంటీర్లు, గ్రామ వార్డు సచివాలయాల వ్యవస్థను ఏర్పాటు చేసి గ్రామ స్వరాజ్యాన్ని స్థాపించారన్నారు. సుమారు రూ.500 కోట్లతో అంబేడ్కర్ స్మృతి వనం ఏర్పాటు చేయడంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చిరకాలం నిలుస్తుందన్నారు. ప్రపంచ దేశాల నుంచి ఎవరు మన దేశానికి వచ్చినా అంబేడ్కర్ స్మృతివనాన్ని తప్పనిసరిగా సందర్శిస్తారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ యూత్ లీడర్ కొట్టు విశాల్, తెన్నేటి జగ్జీవన్, చీకటిమిల్లి మంగరాజు, చింతా వెంకటరావు, జోగేంద్ర పాల్గొన్నారు.

తుపాను ప్రభావంపై వీడియో కాన్ఫరెన్స్



వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రత్యేక అధికారి కె.కన్నబాబు, కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులు

భీమవరం(ప్రకాశంచౌక్): తుపాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా క్యాంపు కార్యాలయం నుంచి సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. భీమవరం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి ప్రత్యేక అధికారి కె.కన్నబాబు, కలెక్టర్ పి.ప్రశాంతి, జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ యు.రవిప్రకాష్, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ సుందర్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. తుపాను ప్రభావం, చేపడుతున్న సహాయచర్యలపై సీఎంకి జిల్లా కలెక్టర్లు వివరించారు.

మూడ్రోజుల ప్రత్యేక కార్యాచరణ

భీమవరం (ప్రకాశంచౌక్): తుపాను ప్రభావిత ప్రాంతాలపై కార్యాచరణను రానున్న మూడు రోజులు పగడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ ప్రశాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ అధికారులతో సమావేశమై రానున్న మూడు రోజులు కార్యాచరణ అమలుకు చర్యలపై ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యానవన పంటల నష్టంపై సమగ్రంగా పరిశీలించి నివేదికను అందజేయాలని ఉద్యానవన శాఖ అధికారిని ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారిని ఆదేశించారు. ఇరిగేషన్ శాఖకు చెందిన ప్రతి ఉద్యోగి, అధికారి క్షేత్రస్థాయిలోనే ఉండాలని ఆదేశించారు. గర్భిణీ స్త్రీలను నేడు కూడా ప్రభుత్వ ఆసుపత్రిలో ఉండేలా చూడాలన్నారు. పెద్ద ఎత్తున వైద్య శిబిరాలు నిర్వహించాలని, డెంగ్యూ, మలేరియా పరీక్షలతో పాటు, ఫీవర్ సర్వేను కూడా చేయించాలని డీఎంహెచ్‌ఓను ఆదేశించారు. జిల్లాలోని అన్ని పంచాయతీల్లో, పట్టణ ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పెద్ద ఎత్తున చేపట్టాలని, అవసరమైన చోట తాగునీటి వనరులను శుభ్రం చేయించాలని జిల్లా పంచాయతీ అధికారి, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు.

అంబేడ్కర్ సేవలు చిరస్మరణీయం



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్పీ రవిప్రకాష్

భీమవరం: అణగారినవర్గాల అభ్యున్నతికి అంబేడ్కర్ చేసిన సేవలు చిరస్మరణీయమని ఎస్పీ యు.రవిప్రకాష్ అన్నారు. బీఆర్ అంబేడ్కర్ 67వ వర్ధంతి సందర్భంగా బుధవారం జిల్లా కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అంటరానితనంపై అంబేడ్కర్ అలుపెరగని పోరాటం చేశారని దళితులు, గిరిజనులు, మహిళలు, కార్మికుల హక్కుల కోసం అవిశ్రాంత కృషి చేసిన మహనీయుడని కొనియాడారు. సమాజంలోని అన్ని వర్గాలకు సర్వసత్తాక సార్వభౌమాధికారం ఉండాలంటూ రాజ్యాంగాన్ని రూపొందించారన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఏవీ సుబ్బరాజు పాల్గొన్నారు.

అన్ని విధాలా ఆదుకుంటాం

మొగల్తూరు: తుపాను దృష్ట్యా నష్టపోయిన రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని మంత్రి కారుమూరి నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం మొగల్తూరు జాతీయ రహదారిపై రైతులు ఆరబెట్టిన ధాన్యాన్ని ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడారు. తేమ శాతంతో సంబంధం లేకుండా ధాన్యం కొనుగోలు చేస్తామని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. తేమ శాతంతో సంబంధం లేకుండా రైతుల నుంచి మిల్లర్లు ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఆదేశాలు ఇచ్చామన్నారు. తుపాను కారణంగా ఆస్తి, ప్రాణ నష్టాలు జరగకుండా ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారన్నారు. భారీ వర్షాల కారణంగా కల్లాలో ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయాలని మిల్లర్లకు సూచించామన్నారు. ఇంకా కోతలు కోయని వరి పంటల్ని అధికారుల సలహాలు పాటించి కోయాలని సూచించారు.

నిబంధనలు సడలించాం

పెనుగొండ: తుపానుతో నష్టపోయిన ప్రతి రైతును ఆదుకోవడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. బుధవారం పెనుగొండ, ఆచంట మండలాల్లోని ఆచంట వేమవరం, పెనుమంచిలి, కందరవల్లి, కరుగోరుమల్లి, భీమలాపురం, కోడేరు, పెదమల్లం, చిన్నమల్లం, నడిపూడిల్లో ముంపునకు గురైన వరిచేలను, రాసుల మీద ఉన్న ధాన్యాన్ని పరిశీలించారు. నిబంధనలు సడలించి హుటాహుటిన ధాన్యాన్ని మిల్లులకు చేర్చుకోవచ్చునని ప్రకటించినట్లు తెలిపారు. తుపాను తీవ్రత తగ్గడంతో మునిగిన పంటల నష్టం అంచనా వేస్తామన్నారు. ధాన్యం తడిసి నష్టపోతే నష్ట నివారణ చర్యలు తీసుకోవడానికి సీఎం జగన్ అధికారులకు సూచనలు జారీ చేశారన్నారు. బోదెల ప్రక్షాళనకు ఆదేశాలు జారీ చేశారు. చేలల్లో వర్షపు నీరు త్వరగా తరలించడానికి సేడీలు తీసి రైతులకు అండగా నిలవాలని, నష్ట అంచనాలు త్వరగా వేసి ప్రభుత్వానికి సమర్పించాలని ఆదేశించారు.

ప్రతి ధాన్యపు గింజను కొంటాం

వీరవాసరం: ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేయడానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారని ప్రభుత్వ విప్ ,ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. వీరవాసరం మండలంలో నేల కొరిగిన పంట పొలాలను, సుడిగాలితో నష్టపోయిన ఇళ్లను బుధవారం ఆయన పరిశీలించారు. ముందుగా వీరవాసరం, తోలేరు, పడమటిపాలెం, కొండేబట్లచెరువు గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ పది రోజులు దాటితే రైతులు ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకోవడానికి అవకాశం ఉండేదని అన్నారు. రైతులకు వచ్చిన కష్టాన్ని తమ ప్రభుత్వం అన్ని విధాలా పరిష్కరిస్తుందని, గ్రామాన్ని యూనిట్‌గా చేసుకుని పంట బీమా ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ఈ పంటకు సంబంధించి ప్రభుత్వం ముందుగానే రైతులను సాగుకు సన్నద్ధం చేసిందని, కొన్నిచోట్ల రైతులు సకాలంలో సాగు చేసుకున్నారని, మిగిలినవారు ఆలస్యంగా సాగు చేసుకోవడంతో నష్టపోయారన్నారు. రైతులకు ఏ కష్టం వచ్చినా తానున్నానంటూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రైతులకు అండగా నిలబడ్డారని గత నాలుగున్నర ఏళ్లగా రైతులకు అన్ని విధాలుగా ప్రభుత్వం అండగా ఉందనే విషయం రైతులకు తెలుసునన్నారు.

నష్టాలు వేగంగా అంచనా వేయాలి

నరసాపురం రూరల్: నరసాపురం మండలంలోని సీతారామపురం సౌత్, సీతారామపురం నార్త్, కొప్పర్రు, మల్లవరం, మల్లవరం లంక గ్రామాల్లో పంట నష్టపోయిన ప్రాంతాల్లో చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు పర్యటించారు. అనంతరం లిఖితపూడి, సారవ, లక్ష్మణేశ్వరం గ్రామాల్లో మంత్రి కారుమూరితో కలసి పర్యటించారు. ఈ సందర్భంగా ముదునూరి ప్రసాదరాజు మాట్లాడుతూ జిల్లాలో సుమారు 23 వేల హెక్టార్లలో పంట నష్టం జరిగిందని అంచనా వేశామన్నారు. చివరి గింజ వరకూ రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేస్తామన్నారు. టోర్నడోలు ఎక్కడో అమెరికాలో వస్తాయని, మన ప్రాంతంలో కూడా రావడం బాధాకరమన్నారు. అధికారులు నష్టాలను పూర్తిగా అంచనా వేయాలన్నారు.



తాడేపల్లిగూడెం రూరల్ : కడియద్దలో నీట మునిగిన మినుము పంటను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ



మొగల్తూరు: జాతీయ రహదారిపై ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

నీరు బయటకు పోయేలా చర్యలకు ఆదేశం

తాడేపల్లిగూడెం రూరల్: తుపాను ప్రభావంతో ముంపునకు గురైన మండలంలోని కడియద్ద, కృష్ణాపురం, నీలాద్రిపురం గ్రామాల్లో ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా మినుము, పెసర చేలను పరిశీలించారు. తక్షణమే పొలాల్లో నిలిచిన నీరు డ్రెయినేజీల ద్వారా బయటకు పోయేలా జేసీబీలతో యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. తుపాను ప్రభావంతో గత రెండ్రోజులుగా కురిసిన భారీ వర్షాలకు పల్లపు ప్రాంతాలు, పంట పొలాల్లోకి చేరిన నీరును తక్షణమే బయటకు పోయేలా ఏర్పాట్లు చేశామన్నారు. వరి రైతులు తుపాను బారిన పడకుండా ధాన్యం అమ్ముకుని సురక్షితంగా బయటపడ్డారన్నారు. మోదుగగుంట, వీరంపాలెం, రామన్నగూడెం, నీలాద్రిపురం, పట్టింపాలెం గ్రామాల్లో మినుము, పెసర పంటలు 533 హెక్టార్లలో ఉంటే సుమారు 1400 ఎకరాల్లో మూడో పంటగా సాగు చేశారన్నారు. ఇందులో 900 ఎకరాలు వర్షం నీటిలో మునిగినట్లు గుర్తించామన్నారు. వర్షం పూర్తిగా లాగిన తర్వాత అధికారులు నష్టాలను అంచనా వేస్తారన్నారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం పూర్తిగా ఆదుకుంటుందని, ఆందోళన చెందవద్దని మంత్రి భరోసానిచ్చారు. పెంటపాడు మండలం ప్రత్తిపాడులో 106 ఎకరాలు, బి.కొండేపాడు, మీనవల్లూరులో 190 ఎకరాల్లో మాత్రమే వరి పంట కోతలు జరగాల్సి ఉందన్నారు. తడిసిన ధాన్యాన్ని సైతం తేమతో నిమిత్తం లేకుండా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు.



నరసాపురం రూరల్: మల్లవరంలో ముంపు పొలాలను పరిశీలిస్తున్న చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు తదితరులు



పెనుగొండ : మండలంలోని చినమల్లంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు



వీరవాసరం: మండలంలో నీట మునిగిన వరిపనలను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

జిల్లాలో 23,661 హెక్టార్లలో పంట నష్టం

భీమవరం (ప్రకాశంచౌక్): తుపాను కారణంగా జిల్లాలో సుమారు 23,661 హెక్టార్లలో పంట నష్టం జరిగిందని, వివిధ మౌలిక వసతులు దెబ్బతినడం కారణంగా సుమారు రూ.188 కోట్ల నష్టం వాటిల్లిందని కలెక్టర్ పి.ప్రశాంతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 19 మండలాల్లోని 113 గ్రామాలు తుపాను వల్ల తీవ్ర వర్షాలు, ఈదురు గాలుల తాకిడికి గురయ్యాయని తెలిపారు. 19 గ్రామాలలో, నాలుగు మున్సిపాలిటీలలోని కొన్ని ప్రాంతాల్లో నీరు చేరిందని, దీని కారణంగా 4,090 మంది ప్రజలు ప్రభావితం అయ్యారని తెలిపారు. మూడు పక్కా గృహాలు, 11 కచ్చా గృహాలు పూర్తిగా దెబ్బతినగా.. 12 కచ్చా గృహాలు తీవ్రంగా దెబ్బతిన్నాయన్నారు. 79 గృహాలు స్వల్పంగా దెబ్బతిన్నాయని చెప్పారు. పాక్షికంగా దెబ్బతిన్న గృహాలకు సుమారు రూ.14 లక్షల నష్టం వాటిల్లిందన్నారు. పదిమందికి స్వల్ప గాయాలయ్యాయని తెలిపారు. 32 పశువుల పాకలు దెబ్బతినగా సుమారు రూ.3.2 లక్షల నష్టం వాటిలిందన్నారు. 6,354 ఆహార పొట్లాలను, 15,336 వాటర్ ప్యాకెట్లను అందజేశామన్నారు. 31 మెడికల్ క్యాంపులను నిర్వహించి సేవలు అందించామన్నారు. 423.53 కిలోమీటర్ల మేర ఆర్ అండ్ బీ రహదారులు దెబ్బతిన్నాయని, 20 చెట్లు కూలిపోయాయని, 3 ఆర్ అండ్ బీ రహదారులపై నీరు చేరిందని, రెండు చోట్ల ట్రాఫిక్ అంతరాయం కలిగిందని తెలిపారు. రోడ్ల తాత్కాలిక మరమ్మతులకు సుమారు రూ.11 కోట్లు ఖర్చవుతుందని, శాశ్వత నిర్మాణాలకు రూ.165 కోట్ల ఖర్చు కాగలదన్నారు. పంచాయతీరాజ్‌కు సంబంధించి 9.7 కిలోమీటర్ల మేర 6 రోడ్లు దెబ్బతినగా తాత్కాలిక మరమ్మతులకు సుమారు రూ.42 లక్షలు, శాశ్వత నిర్మాణాలకు రూ.130 లక్షలు ఖర్చు కాగలదన్నారు. మూడు అర్బన్ ప్రాంతాల్లోని 17.7 కిలోమీటర్ల మేర రహదారులు, 5.4 కిలోమీటర్ల మేర ఓపెన్ డ్రెయిన్లు, అండర్ గ్రౌండ్ డ్రెయిన్లు, 702 వీధి దీపాలు దెబ్బతిన్నాయని తెలిపారు. 16 ప్రదేశాల్లో పారిశుద్ధ్య నిర్మాణాలు దెబ్బతినగా, వాటి పునరుద్ధరణకు సుమారు రూ.53 లక్షలు ఖర్చవుతుందని తెలిపారు.

పాలకొల్లులో 346 మి.మీ. వర్షపాతం

భీమవరం: తుపాను కారణంగా జిల్లావ్యాప్తంగా సరాసరి బుధవారం 183.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా పాలకొల్లులో 346.6 మిల్లీమీటర్లు వర్షం కురిసింది. ఆకివీడులో 226.8, గణపవరంలో 223.6, ఇరగవరంలో 208.6, నరసాపురంలో 205.2, కాళ్లలో 204 మి.మీ. వర్షపాతం నమోదైంది. తాడేపల్లిగూడెంలో 143, పెంటపాడులో 163.6, తణుకులో 169.2, అత్తిలిలో 157.6, ఉండిలో 176.6, పాలకోడేరులో 142.4, పెనుమంట్రలో 157.2, పెనుగొండలో 152.6, ఆచంటలో 162.6, పోడూరులో 166.6, వీరవాసరంలో 197.6, భీమవరంలో 174, మొగల్తూరులో 163.6, యలమంచిలిలో 130.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని సమాచార శాఖ తెలిపింది

క్లుప్తంగా

జిల్లాలు దాటి.. పింఛన్ అందించి..


కాకినాడలో సత్యనారాయణకు వృద్ధాప్య పింఛన్ అందిస్తున్న వలంటీర్ దుర్గాంబ

తణుకు టౌన్: తుపాను వంటి ప్రకృతి విపత్తులను సైతం లెక్కచేయకుండా జిల్లాలు దాటి పింఛన్ అందించి మహిళా వలంటీర్ సేవాభావాన్ని చాటారు. తణుకు మండలం వేల్పూరు 1వ సచివాలయ పరిధిలో వృద్ధాప్య పింఛన్ లబ్ధిదారు చుండ్రు సత్యనారాయణ అనారోగ్య కారణాలతో కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వలంటీర్ వాసా దుర్గాంబ బుధవారం వేల్పూరు నుంచి కాకినాడ వెళ్లి ఆయనకు పింఛన్ అందజేశారు.

ఎర్రకాలువకు పోటెత్తిన వరద

జంగారెడ్డిగూడెం రూరల్: కొంగువారిగూడెంలో ఎర్రకాలువ జలాశయం ఉగ్రరూపం దాల్చింది. ఇన్‌ఫ్లో 20 వేల క్యూసెక్కుల నీరు జలాశయంలోకి వచ్చి చేరుతుండగా డ్యాం నాలుగు గేట్లను ఎత్తి గంటకు 2,500 క్యూసెక్కుల నీటిని దిగువకు విడిచిపెడుతున్నారు. జలాశయం నీటిమట్టం 83.50 మీటర్లు కాగా ప్రస్తుతం 83.40 మీటర్ల నీరు ఉందని ఏఈ భాస్కరరావు తెలిపారు.

ఆపద వేళ.. ఆపన్నహస్తంలా..



ఆకివీడులో మూర్ఛరోగిని రాజును సురక్షిత ప్రాంతానికి తరలిస్తున్న వలంటీర్, పెదమైనవానిలంకలో దివ్యాంగుడిని శిబిరానికి తీసుకువెళుతున్న దృశ్యం



వేములదీవిలో వృద్ధ దంపతులను పునరావాస కేంద్రానికి తీసుకువెళుతున్న వలంటీర్, మొగల్తూరు మండలం బీకే మెరకలో వంట చేస్తున్న దృశ్యం

తుపాను బాధితులకు వలంటీర్ల సేవలు

నరసాపురం రూరల్/ఆకివీడు/పాలకొల్లు అర్బన్: కరోనా.. వరదలు.. తుపాన్లు.. విపత్తు ఏదైనా సేవకు నిదర్శనంగా నిలుస్తున్నారు వలంటీర్లు. హోరుగాలి, జోరువానలోనూ ప్రజలకు అండగా ఉంటూ నష్టనివారణకు తోడ్పడుతున్నారు. పశ్చిమగోదావరి జిల్లాపై మిచాంగ్ తుపాను తీవ్ర ప్రభావం చుపగా నరసాపురం నియోజకవర్గంలోని నరసాపురం, మొగల్తూరు మండల్లాలోని తీర ప్రాంతాల్లో బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించడంతో వారి చూపిన చొరవతో ప్రాణనష్టం తప్పింది. అలాగే పూరిళ్లలో నివసిస్తున్న వారిని శిబిరాలకు తరలించిన అనంతరం బాధితుల ఇళ్లు నేలమట్టమైన సంఘటనలు చోటుచేసుకున్నాయి. దీంతో ప్రజలంతా శభాష్ అంటున్నారు. అలాగే పునరావాస కేంద్రాల్లో వంటలు చేయడం వంటి సేవలను వలంటీర్లు అందిస్తున్నారు.

ముంపులో చిక్కుకున్న వారిని..

కుంభవృష్టితో లోతట్టు ప్రాంతంలో ముంపు నీటిలో చిక్కుకున్న ప్రజల్ని రక్షించడంలో వలంటీర్ సేవలు భళా అని పలువురు కొనియాడుతున్నారు. ఆకివీడులోని అమృతరావు కాలనీ ప్రాంతానికి చెందిన వలంటీర్ రేల రాజు శ్మశానవాటిక ప్రాంతంలో నివసిస్తున్న రోగులను, మూర్ఛరోగిని వారి ఇంటి నుంచి బయటకు తీసుకువచ్చి రక్షించారు. రెండు అడుగులనీటిలో బాధితుల్ని సురక్షితంగా బయటకు తీసుకువచ్చి పునరావాస కేంద్రంలోకి తరలించారు. అక్కడ వారికి భోజనం, వసతి సమకూర్చి అర్ధరాత్రి వరకు సేవలందించారు.

ఇంటింటికీ తిరిగి చెప్పాం



తుపాను ప్రభావం, దాని వలన కలిగే నష్టాలపై ఇంటింటికీ తిరిగి చెప్పాం. ముఖ్యంగా పాతబడిన పెంకుటిల్లు, పూరిపాకల్లో ఉన్నవారిని అప్రమత్తం చేశాం. వర్షాల కారణంగా విద్యుత్ స్తంభాల వద్దకు వెళ్లవద్దని ముందు జాగ్రత్తలు సూచించాం. అలాగే మూడు రోజులకు సరిపడా నీరు నిల్వ చేసుకోవాలని చెప్పాం. అనారోగ్య సమస్యలు ఉంటే చెబితే చర్యలు తీసుకుంటామన్నాం.

–ఎస్.నాగవేణి, వలంటీర్, నగంచెరువు, పాలకొల్లు మండలం

ఉద్యాన పంటలకు రూ.2.50 కోట్ల నష్టం

భీమవరం: తుపాను కారణంగా జిల్లాలో ఉద్యాన పంటలకు సుమారు రూ.2.55 కోట్ల నష్టం వాటిల్లినట్టు అధికారుల అంచనా వేశారు. జిల్లా ఉద్యాన శాఖాధికారి ఎ.దుర్గేష్ పలు ప్రాంతాల్లో పర్యటించి నష్టం అంచనాలు తయారుచేశారు. జిల్లాలోని 20 మండలాల పరిధిలో సుమారు 250 ఎకరాల్లో కొబ్బరికి రూ.49 లక్షలు, 62 ఎకరాల్లో అరటికి రూ.కోటి, సుమారు 300 ఎకరాల్లో కూరగాయల తోటలకు రూ.1.60 కోట్లు నష్టం వాటిల్లినట్టు అంచనా వేశారు. ఆచంట నియోజకవర్గంలో 205 ఎకరాల్లో 209 మంది రైతులకు సుమారు రూ.76 లక్షలు, నరసాపురం నియోజకవర్గంలో 323 మందికి రైతులకు సుమారు రూ.22.45 లక్షలు, వీరవాసరం మండలంలో 100 మంది రైతులకు రూ.5 లక్షలు, పోడూరు మండలంలో రూ.16 లక్షలు, తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో రూ.30 లక్షలు, పాలకొల్లు నియోజకవర్గంలో 312 మందికి రైతులకు రూ.39.50 లక్షలు, మొగల్తూరులో రూ.7.20 లక్షలు, పెనుగొండ మండలంలో రూ.59.44 లక్షల నష్టం వాటిల్లినట్టు అంచనా వేశామని దుర్గేష్ వివరించారు.


పెనుగొండ మండలం సిద్ధాంతంలో పడిపోయిన అరటి తోట

1.29 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు

డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: సార్వా సీజన్‌కు సంబంధించి జిల్లాలోని భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెం రెవెన్యూ డివిజన్ల పరిధిలో 1,29,762 టన్నుల ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేశామని, ఇందులో 20 వేల టన్నుల తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం సేకరించిందని డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ అన్నారు. కడియద్దలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రైతులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, భారీవర్షానికి తడిసిన ధాన్యాన్ని తేమ శాతంతో సంబంధం లేకుండా ప్రభుత్వం కొనుగోలు చేసేలా సీఎం జగన్ ఆదేశాలిచ్చారన్నారు. మెట్ట ప్రాంతంలో పురాతన డ్రెయినేజీ వ్యవస్థ ప్రస్తుతం కనుమరుగైందని, దానిని పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. బ్రిటీష్ కాలం నుంచి మెట్ట ప్రాంతంలో డ్రెయినేజీ వ్యవస్థ ఉందని, ఇటీవల నియోజకవర్గ సమీక్షా సమావేశం సందర్భంగా ఆనాటి డ్రెయినేజీ వ్యవస్థకు సంబంధించిన మ్యాపులను సేకరించామన్నారు. ఎక్కడెక్కడ పంట కాలువలు, మురుగు బోదెలు వంటి డ్రెయినేజీ వ్యవస్థ ఉందో గుర్తించి, దానిని పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. దీనికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ చెన్నయ్యకు ఆదేశించారు.


కడియద్దలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం కొట్టు

నేడు ఫెన్సింగ్ సెలెక్షన్స్

తాడేపల్లిగూడెం (టీఓసీ): విజయనగరంలో ఈనెల 8 నుంచి 10 వరకు జరిగే అండర్–14 సబ్ జూనియర్, అండర్–17 ఇంటర్ డిస్ట్రిక్ట్ క్యాడెట్ బాలబాలికల ఫెన్సింగ్ పోటీలకు జట్ల ఎంపిక కార్యక్రమం గురువారం స్థానిక డీఎస్ చెరువు సమీపంలోని జిల్లా ఫెన్సింగ్ కార్యాలయంలో నిర్వహించనున్నట్టు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి జీఎస్‌వీ కృష్ణమోహన్ ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 3 గంటల నుంచి సెలెక్షన్స్ ఉంటాయని పేర్కొన్నారు. సబ్ జూనియర్స్ విభాగానికి 2010 జనవరి 1 తర్వాత, క్యాడెట్ విభాగానికి 2007 జనవరి 1 నుంచి 2010 నవంబరు 30లోపు జన్మించిన వారు అర్హులని, గుర్తింపు కార్డు, ఆధార్, బర్త్ సర్టిఫికెట్, ఫెన్సింగ్ పరికరాలతో హాజరుకావాలని సూచించారు.

క్లుప్తంగా

రాజమండ్రి వెళ్లి పింఛన్ అందజేత



పింఛన్ అందజేస్తున్న గ్రామ వలంటీర్ మమత

పెంటపాడు: మండలంలోని కోరిమిల్లి గ్రామానికి చెందిన ఆలపాటి లక్ష్మీదుర్గ అనారోగ్యంతో బాధపడుతూ రాజమండ్రిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. గ్రామ వలంటీర్ సీహెచ్ మమత బుధవారం యూత్ నాయకులు చిలకా నాగరాజు సహాయంతో రాజమండ్రి వెళ్లి లక్ష్మీదుర్గకు పింఛన్ అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ వల్లూరి సత్యవతి, మాజీ సర్పంచ్ వల్లూరి బ్రహ్మానందం, వలంటీర్ సేవలను గాను ప్రత్యేకంగా అభినందించారు.

ధాన్యాన్ని మిల్లులకు తరలించాలి

తణుకు టౌన్: తుపానుతో నీటమునిగిన ధాన్యాన్ని రైతులు మిల్లులకు తరలించాలని తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్, మండల వ్యవసాయాధికారి సీహెచ్ శ్రీనివాస్‌లు కోరారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా మండలంలోని పలు గ్రామాల్లో నీట మునిగిన ధాన్యాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 11,200 ఎకరాల్లో వరి సాగు చేయగా వాటిలో 9,000 ఎకరాల్లోని వరి పంటను కోయడం జరిగిందన్నారు. కోతలు పూర్తైన పంటలో 13,100 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా సేకరించడం జరిగిందన్నారు. ఇంకా రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని కూడా త్వరిత గతిన సేకరించి మిల్లులకు తరలిస్తామని తెలిపారు.

'గూడెం'లో 143.0 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం పట్టణ, పరిసర గ్రామాల్లో గడిచిన 24 గంటల్లో 143.0 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందని ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఎస్.శివశంకర్ బుధవారం తెలిపారు. పెంటపాడు మండలంలో 163.6 మిల్లీ మీటర్లుగా వర్షపాతం నమోదైందన్నారు.

9,500 క్యూసెక్కుల నీరు విడుదల



మాధవరం - కంసాలిపాలెం కాజ్ వే వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న ఎర్ర కాలువ నీటి ప్రవాహం

తాడేపల్లిగూడెం రూరల్: మిచాంగ్ తుపాను ప్రభావంతో గత రెండ్రోజులుగా కురిసిన వర్షాలకు జంగారెడ్డిగూడెం మండలంలోని కొంగువారిగూడెం ప్రాజెక్టు (ఎర్ర కాలువ) కు భారీగా వరద నీరు చేరింది. దీంతో దిగువకు 9500 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. ఈ నేపథ్యంలో తాడేపల్లిగూడెం మండలంలోని మాధవరం కాజ్ వే వద్ద ఎర్ర కాలువ ఉధృతంగా ప్రవహిస్తోంది. మాధవరం - కంసాలిపాలెం మధ్య తాత్కాలికంగా ఏర్పాటు చేసిన వారధి సైతం నీట మునిగింది. దీంతో రెండు జిల్లాల మధ్య మాధవరం మీదుగా రాకపోకలు నిలిచిపోయాయి. అయితే మండలంలోని ఎర్ర కాలువ పరీవాహక గ్రామాలకు చెందిన మినుము, నారు మడులు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆకట్టుకుంటున్న హరికథా సప్తాహ మహోత్సవాలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని మహాలక్ష్మీనగర్ కర్రి ప్రభాకర బాలాజీ నివాసం వద్ద బుధవారం రాత్రి పురాణం విజయలక్ష్మిచే పార్వతీ కళ్యాణం హరికథా గానం చేశారు. ద్వితీయ హరికథా సప్తాహ మహోత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమం జరిగింది. అలాగే, సుస్మిత శాస్త్రీయ సంగీత కచేరి ఆహుతులను ఎంతగానో ఆకట్టుకుంది. కళాకారులు, కళాభిమానులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

తుపాను వేగంతో స్పందన



డ్రెయిన్లలో సిల్ట్ తీయిస్తున్న మున్సిపల్ కమిషనర్ డాక్టర్ ఎ.శామ్యూల్

తాడేపల్లిగూడెం రూరల్: మిచాంగ్ తుపాను ప్రభావంతో మంగళవారం సాయంత్రం వీచిన ఈదురు గాలులు ధాటికి తాడేపల్లిగూడెం పట్టణంలోని పలు చోట్ల విద్యుత్ లైన్లు తెగిపడ్డాయి. దీంతో బుధవారం ఉదయం విద్యుత్ లైన్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బంది లైన్ మరమ్మతులు చేపట్టి, విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. మరో పక్క పట్టణ ప్రధాన డ్రెయిన్లలో సిల్ట్ తీసి, మురుగునీరు ముందుకు సాగేలా మున్సిపల్ కమిషనర్ డాక్టర్ అనపర్తి శామ్యూల్ సిబ్బంది సహకారంతో చర్యలు చేపట్టారు. అలాగే, రూరల్ మండలంలోని చిన తాడేపల్లి, మాధవరం, కడియద్ద, ఎల్.అగ్రహారం, తదితర గ్రామాల్లో లోతట్టు ప్రాంతాల్లోకి వర్షపు నీరు చేరింది.

మిచాంగ్ గండాన్ని అధిగమించిన అధికార యంత్రాంగం

- ప్రాణ, ఆస్తి నష్టాలు లేకుండా బయటపడ్డ వైనం
- పడిపోయిన వృక్షాలను వెంటనే తొలగింపు
- రిలీఫ్ సెంటర్‌లో బాధితులకు అన్ని వసతులు



తణుకు మున్సిపల్ పాఠశాలలో బాధితులకు ఏర్పాటు చేసిన భోజన వసతిని పర్యవేక్షిస్తున్న కమిషనర్ బీవీ రమణ



తణుకు రాష్ట్రపతి రోడ్డులో మోటారు ద్వారా నీటిని తోడుతున్న దృశ్యం



తణుకు వేల్పూరు రోడ్డులో రహదారిపై పడిపోయిన వృక్షాన్ని తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

తణుకు అర్బన్: మిచాంగ్ తుపాను కారణంగా భారీ వర్షాలు, ఈదురుగాలులతో ఇబ్బందులు తలెత్తినప్పటికీ తణుకు ప్రాంతంలో అధికార యంత్రాంగం చూపిన చొరవతో ప్రాణ, ఆస్థినష్టం లేకుండా గండం గడిచింది. గత మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు తణుకు మున్సిపల్ యంత్రాంగంతోపాటు విద్యుత్, రెవెన్యూ, హెల్త్ విభాగాల అధికారులు, సిబ్బంది సమిష్టిగా పనిచేయడంతో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పరిస్థితి చక్కబడింది. మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి రహదారులపై నీరు నిలిచినప్పటికీ వర్షం తగ్గగానే డ్రెయినేజీలు నీటిని లాగేయడంతోపాటు పారిశుధ్య సిబ్బంది కష్టంతో నీటి నిల్వలు డ్రెయినేజీల గుండా బయటకు పోయాయి. అయితే పట్టణ పరిధిలో నాలుగు వృక్షాలు రహదారులపై పడిపోగా వెంటనే మున్సిపల్ సిబ్బంది తొలగించారు.

ముందస్తు చర్యలు..

మిచాంగ్ తుపాను దృష్ట్యా మున్సిపల్ కమిషనర్ బీవీ రమణ మున్సిపల్ కార్యాలయంలో ఒక కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. అంతేకాకుండా సదరు కాల్ సెంటర్‌లో 3 షిఫ్టులతో అధికారులు, సిబ్బందిని అందుబాటులో ఉంచారు. విద్యుత్ సరఫరా అంతరాయం కలిగితే తాగునీటికి ఇబ్బంది లేకుండా వాటర్ హెడ్ ట్యాంకుల వద్ద రెండు 100 కేవీ జనరేటర్‌లు, 2 జేసీబీలు, 4 ఆయిల్ ఇంజన్‌లు, 2 జనరేటర్‌లు ఉంచారు. అంతేకాకుండా పట్టణ పరిధిలో ఉన్న హోర్డింగ్‌లను ముందుగానే తొలగించారు. రాత్రి కురిసిన భారీ వర్షానికి పాతవూరులోని పల్లపు ప్రాంతాల్లో రహదారుల పక్కన నివాసముంటున్న 35 మంది బాధితులను నంబరు 1 మున్సిపల్ పాఠశాలలో రిలీఫ్ క్యాంపు ఏర్పాటుచేసి ఉంచారు. వారికి టిఫిన్‌లు, పాలు, బిస్కెట్స్, మాంసాహారంతో భోజనవసతి కల్పించారు.

అధికార యంత్రాంగం బాగా పనిచేశారు



మిచాంగ్ నష్టం తీవ్రంగా ఉంటుందన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో ప్రభుత్వం ముందస్తుగా అధికారులకు స్పష్టమైన ఆదేశాలను జారీ చేసింది. రైతాంగానికి నష్టం కలిగినప్పటికీ రైతులందరినీ పూర్తిగా ఆదుకుంటాం. తుపాను కారణంగా కురిసిన భారీ వర్షాలకు రహదారులపై వర్షపు నీటి నిల్వలు లేకుండా ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా అధికార యంత్రాంగం, పారిశుద్ధ్య సిబ్బంది ఎంతో కష్టపడి పనిచేశారు. వారందరినీ ప్రత్యేకంగా అభినందిస్తున్నాను. తణుకు ప్రాంతంలో ఎటువంటి నష్టం లేకుండా బయటపడగలిగాం.

– కారుమూరి వెంకట నాగేశ్వరరావు, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి

ప్రణాళికాబద్ధంగా పనిచేశాం



మిచాంగ్ తుపాను పరిస్థితులను ముందుగానే ఊహించి ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేశాం. ఎక్కడా కూడా ఆస్తి నష్టం, ప్రాణ నష్టం కలుగకుండా జాగ్రత్తలు పాటించాం. మంత్రివర్యులు కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఎప్పటికప్పుడు మాకు ఆదేశాలిస్తూ పరిస్థితులను పర్యవేక్షించారు. పల్లపు ప్రాంతాల్లో నివాసముంటున్న వారిని 35 మందిని ప్రస్తుతం పునరావాస కేంద్రంలో పెట్టి అన్ని వసతులు కల్పించాం.

– బీవీ రమణ, మునిసిపల్ కమిషనర్, తణుకు

డ్రెయినేజీల నిర్మాణాలే కీలకం..

భారీ వర్షానికి జిల్లాలోని పలు ప్రాంతాల్లో ముంపునకు గురికాగా తణుకులో మాత్రం రహదారులపై నీటి నిల్వలులేకుండా ఉండడానికి గతంలోనే దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ప్రస్తుత మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఎమ్మెల్యేగాఉన్న సమయంలోనే కోట్లాది రూపాయిలు వెచ్చించి డ్రెయినేజీల నిర్మాణాలు చేపట్టి పూర్తిచేశారు. ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ సమయంలో సైతం మిగిలి ఉన్న డ్రెయినేజీలను అభివృద్ధిచేశారు. దీంతో రహదారులపై నీటి నిల్వలు లేకుండా నీరు డ్రెయినేజీల గుండా ప్రవహించింది. ఒక్క రాష్ట్రపతి రోడ్డులోని జిల్లా కేంద్ర ఆస్పత్రి ప్రాంతంలో మాత్రమే కల్వర్టు పాడై పోవడంతో రహదారిపై నిరు నిల్వ ఉండగా మున్సిపల్ అధికారులు మోటారుసాయంతో నీటిని తోడించారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి



తణుకు అర్బన్: అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



తాడేపల్లిగూడెం (టీఓసీ): అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న బార్ అసోసియేషన్ నాయకులు



తాడేపల్లిగూడెం: నిట్‌లో అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమం



తణుకు: అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

తణుకు అర్బన్: అంబేడ్కర్ యావత్ భారత దేశం గర్వించ దగ్గ నాయకుడని, ఎన్ని తరాలైనా గుర్తుంచుకోదగిన విశిష్ట వ్యక్తిత్వం గలవాడని ఆయన జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని పౌరులంతా సమసమాజ స్థాపనకు కృషి చేయాలని ఏఎంసీ చైర్మన్ నత్తా కృష్ణవేణి అన్నారు. బుధవారం అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా వైఎస్సార్ సీపీ శ్రేణులు తణుకు మున్సిపల్ కార్యాలయ ప్రాంతంలోనూ, పార్టీ కార్యాలయంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, సుద్దుల పాండు, జంగం ఆనంద్‌కుమార్, పొట్ల సురేష్, జాకబ్ బాబు, నత్తా భాను, కుడుపూడి చంద్రరావు, పుల్లెపు సూర్యచంద్రరావు, జిలానీ, వై.శ్రీనివాస్, యు.శ్రీనివాస్, రమేష్ బాబు, జయరాజు పాల్గొన్నారు.

ఉన్నత విద్యనభ్యసించిన అంబేడ్కర్

తాడేపల్లిగూడెం (టీటీసీ): దేశంలో అందరి కంటే ఉన్నత చదువులు అభ్యసించిన వ్యక్తి అంబేడ్కర్ అని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు అన్నారు. బుధవారం స్థానిక తాలూకాఫీస్ సెంటర్‌లో అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి మంగరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంగరాజు మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాలను సీఎం జగన్‌మోహన్ రెడ్డి నెరవేరుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసీ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు నీలం అశోక్‌కుమార్, నాయకులు యు.ఏసురత్నం, వీరవల్లి సునీల్, ఎల్ఐసీ నాయకులు గంగాధర్, రెడ్యానాయక్, అంజి కుమార్, పద్మారావులు పాల్గొన్నారు.

బడుగుల ఆశాజ్యోతి అంబేడ్కర్

తాడేపల్లిగూడెం: బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని నిట్ డీన్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ డాక్టర్ జీఆర్‌కె శాస్త్రి అన్నారు. భారతరత్న రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమంలో జీబీ.వీరేష్‌కుమార్, వి.సందీప్,వినోత్‌కుమార్‌రాజా, కిరణ్‌కుమార్, కిషోర్, శ్రీనివాసన్, సంతోష్, సుదర్శనదీప పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని రక్షించుకోవాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): మతోన్మాద బీజేపీ నుంచి రాజ్యాంగాన్ని రక్షించుకోవాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కే.క్రాంతి బాబు అన్నారు. బుధవారం స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 67వ వర్ధంతిని నిర్వహించారు. తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి క్రాంతిబాబు, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు బత్తుల విజయ్‌కుమార్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు. అలాగే బార్ అసోసియేషన్ హాల్‌లో బాబా సాహెబ్ అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు కొప్పిరెడ్డి అప్పిరెడ్డి మాట్లాడారు. న్యాయవాదులు అద్దంకి విజయరత్నం, పీతల సుధాకర్, పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. తాలూకాఫీస్ సెంటర్‌లోనూ అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించారు. తాడేపల్లి దావీదు, పాతగొలుసు జయరాజు, మారిశెట్టి సుబ్బారావు, దాట్ల జగన్నాథరాజు, నీలం సురేష్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ అందరివాడు

అత్తిలి: భారత రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేడ్కర్ 67వ వర్ధంతి కార్యక్రమం అత్తిలి బస్‌స్టేషన్ సెంటర్‌లో బుధవారం నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, మండలపార్టీ అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, ఎంపీపీ మక్కా సూర్యనారాయణ, ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు కోరుకొల్లు వెంకట్రావు, సోషల్ మీడియా కో కన్వీనర్ బుడితి సుజన్‌కుమార్, బీసీసెల్ అధ్యక్షుడు రంభ సూరిబాబు, నూకపెయ్యి రామకృష్ణ, యాళ్ల హనోక్‌కుమార్, ఈడూరి శ్యాంబాబు, సబ్బితి రాజేష్, ఇల్లూరి సంపదరావు, ఇంజే బాలవర్ధి, ఇంజే రమేష్, పల్లి చంటి, చిటకన వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

భారత రాజ్యాంగాన్ని రక్షించుకోవాలి

తణుకు: బీజేపీ బారి నుంచి అంబేడ్కర్ ప్రజలకు అందించిన భారత రాజ్యాంగాన్ని రక్షించుకోవడానికి పోరాటం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్ అన్నారు. బుధవారం స్థానిక ఎన్టీఆర్ పార్కు వద్ద డా.బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి 67వ వర్ధంతి నేపథ్యంలో సీపీఎం ఆధ్వర్యంలో పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ బీజేపీ దేశంలో అధికారంలోకి వచ్చాక దళితులు, ముస్లింలు, అభ్యుదయవాదులపై దాడులు, హత్యలు, అత్యాచారాలు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు గార రంగారావు, కామన మునిస్వామి, అంజిబాబు, ఎస్.మధుబాబు, ఎన్.జయరాజు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ జీవితం స్ఫూర్తిదాయకం

తాడేపల్లిగూడెం: అంబేడ్కర్ జీవితం తరతరాలకు స్ఫూర్తిగా ఉంటుందని డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు అన్నారు.వర్సిటీలోని పరిపాలనాభవనంలో బుధవారం జరిగిన అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ అధికారులు పద్మావతమ్మ, నారం నాయుడు, డి.వెంకటస్వామి పాల్గొన్నారు.

మహోన్నత వ్యక్తి అంబేడ్కర్

తణుకు టౌన్: రాజ్యాంగ నిర్మాత డా.అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లోని వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బుధవారం తణుకు రూరల్ మండలం మండపాక గ్రామంలో మండల పార్టీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు, మాజీ ఏఎంసీ చైర్మన్ ఉండవల్లి జానకి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగం ఆనందకుమార్, దువ్వ గ్రామంలో ఎంపీపీ రుద్ర ధనరాజు, గ్రామ సర్పంచ్ అడ్డా బాబు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. వేల్పూరు గ్రామంలో సొసైటీ అధ్యక్షుడు పెనుమర్తి వెంకట్రామన్న, గ్రామ కమిటీ అధ్యక్షుడు నున్న దుర్గా ప్రసాద్, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ముద్దాపురం గ్రామంలో జెడ్పీటీసీ సభ్యురాలు ముళ్లపూడి అన్నపూర్ణదేవి, గ్రామ సర్పంచ్ మజ్జి పద్మ, తదితరులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళి

ఇరగవరం: ఇరగవరం మండల పరిషత్ కార్యాలయంలో బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొప్పిశెట్టి అలివేలు మంగతయారు. డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, వైసీపీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గాప్రసాద్, ఎంపీడీవో ఏ శ్రీనివాస్, తహసీల్దార్ బి మాలతి పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెం(టీటీసీ): అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు మంగరాజు



తాడేపల్లిగూడెం: ఉద్యానవర్సిటీలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



అత్తిలి: అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



ఇరగవరం: అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎంపీపీ

అధైరపడొద్దు.. ప్రభుత్వం అండగా ఉంది



కొండేపాడు, మీనవిల్లూరు గ్రామాల్లో ధాన్యం రాసులు పరిశీలించి మిల్లులకు తరలిస్తున్న అధికారులు

పెంటపాడు: రైతులు అధైరపడవద్దని, తుపాను వల్ల దెబ్బతిన్న ప్రతి రైతుకూ ప్రభుత్వం అండగా ఉంటుందని పెంటపాడు తహసీల్దార్ జీవీ శేషగిరిరావు, వ్యవసాయాధికారి కె. పార్థసారధిలు పేర్కొన్నారు. బుధవారం అధికారులు పలు గ్రామాల్లో పర్యటించారు. తుపాను వల్ల రైతులు ఇబ్బందులు పడకుండా దగ్గరుండి వారి ధాన్యం పట్టబడి పట్టించి మిల్లులకు తరలించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వల్లూరి బ్రహ్మానందం, పాలా గణపతి, దేవరశెట్టి రాంబాబు, చింతపల్లి శ్రీనివాస్, సర్పంచ్ కట్టా దానయ్య, చల్లా కుమారస్వామి, లింగమూర్తి, ఆయా గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భారీ వర్షాలతో రైతన్న ఇబ్బందులు



భారీ వర్షాలకు నేలనంటిన వరి పంట

తణుకు టౌన్: బంగాళాఖాతంలో ఏర్పడిన మిచాంగ్ తుఫాన్ తీరం దాటుతూ తణుకు మండలంపై తీవ్ర ప్రభావాన్ని చూపించింది. దీంతో తణుకు మండల వ్యాప్తంగా ఉన్న గ్రామాల్లోని ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మంగళవారం రాత్రి వీచిన బలమైన గాలులకు తణుకు, దువ్వ, వేల్పూరు గ్రామాల్లోని విద్యుత్ స్తంభాలు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, భారీ వృక్షాలు నేలకు ఒరగడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడి ఆయా గ్రామాలు చీకట్లో మగ్గాయి. బుధవారం ఉదయం వరకూ కురుస్తున్న వర్షాలతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. తణుకు, వేల్పూరు, దువ్వ గ్రామాల్లో వరి చేలు ముంపునకు గురైయ్యాయి. దీనితో రైతులు చేలల్లోని మురుగునీటిని బయటకు పంపించే ఏర్పాట్లు చేస్తున్నారు.


రైతులకు అందుబాటులో గోనె సంచులు



ఇరగవరంలో రైతులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, అధికారులు

ఇరగవరం: అన్ని రైతు భరోసా కేంద్రాల వద్ద గోనె సంచులు అందుబాటులో ఉన్నాయని డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు అన్నారు. తుపాను ప్రభావంతో తడిచిన ధాన్యం కల్లాలను బుధవారం వైఎస్సార్‌సీపీ నాయకులు అధికారులతో కలిసి పరిశీలించారు. రాష్ట్ర పౌరసరఫరాలశాఖా మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు అందుబాటులో ఉండి, వారికి అండగా నిలుస్తున్నామని చెప్పారు. రైతులు ఎవరూ అధైర్యపడవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గా ప్రసాద్, ఎంపీడీఓ ఏ శ్రీనివాస్, తహసీల్దార్ బి మాలతి, ఏఓ వై రాఘవేంద్రరావు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు



కె సముద్రపుగట్టులో పశువులకు వ్యాక్సినేషన్ చేస్తున దృశ్యం

అత్తిలి: తుపాను ప్రభావంతో అత్తిలి, తణుకు మండలాల పశువులకు అంటువ్యాధులు రాకుండా వ్యాధి నిరోధక టీకాలను పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో వేస్తున్నామని పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకుడు కె నర్సింహారావు బుధవారం తెలిపారు. అత్తిలి మండలం బల్లిపాడు, కె సముద్రపుగట్టు గ్రామాల్లో పశువులకు వ్యాక్సినేషన్ వేశారు. రైతులకు సబ్సిడీపై పశువుల సమీకృత దాణా ఇస్తున్నామని నర్సింహారావు చెప్పారు.

కోర్టు విధులు బహిష్కరించిన న్యాయవాదులు



తణుకులో నిరసన తెలియజేస్తున్న న్యాయవాదులు



గూడెంలో నిరసన తెలియజేస్తున్న న్యాయవాదులు

తణుకు: భూహక్కు చట్టం రద్దు చేయాలని కోరుతూ తణుకులో మూడో రోజు న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించారు. బుధవారం రాష్ట్రపతి రోడ్డులో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కామన మునిస్వామి మాట్లాడుతూ యాక్ట్ 27 కారణంగా భూ యజమానులు నష్టపోతారని తెలిపారు. చట్టాన్ని రూపొందించే ముందు న్యాయవాదుల సలహాలు సూచనలు తీసుకొని చట్టాన్ని రూపొందిస్తే సమస్యలు ఉండవని మునిస్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కొరు వెంకటేశ్వర్లు, కలిదిండి పద్మావతి, జీవీఎంఎస్ ప్రసాద్, డి.పద్మావతి, ఎస్‌కే మోతి, చింతపల్లి నాగేశ్వరరావు, యడ్లపల్లి రాధాకృష్ణ, ఆర్.శ్రీనివాసరావు, బి.రవికుమార్, కె.వెంకన్న బాబు. కె.కృష్ణంరాజు, మంగం ప్రకాష్, ఎం.కుటుంబరావు, సిద్దు, ధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

'గూడెం'లో న్యాయవాదుల నిరసన

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్–2023 చట్టం అమలుకు వ్యతిరేకంగా బుధవారం తాడేపల్లిగూడెం బార్ అసోసియేషన్ కార్యాలయం వద్ద న్యాయవాదులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సహ కార్యదర్శి దాసరి ఏకాంత, మహిళా కార్యదర్శి ఎం.గీతారెడ్డి, కార్యవర్గ సభ్యులు ముళ్లపూడి శ్రీనివాసరావు, అద్దంకి విజయరత్నం, డీఎన్ఎస్.రవిప్రసాద్, ఉంగరాల శివకుమార్, సంధాని బాషా, వీఎస్.రాధాకృష్ణ, న్యాయవాదులు గాజుల గోపీకృష్ణ, ఎంవీఆర్.కృష్ణమోహన్, డి.శ్రీనివాస్, జి.కృష్ణ, బీహెచ్.శేషు, డి.ఇందిర, కేవీ.సత్యనారాయణ, ఎండీ.బాషా, జి.సత్యనారాయణమూర్తి, పీవీవీ.సత్యనారాయణ, బీవీ.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

32 ఎకరాల్లో నీట మునిగిన కూరగాయల పంటలు



నేలకొరిగిన చిక్కుడు పాదులను పరిశీలిస్తున్న మండల ఉద్యాన శాఖ అధికారిణి శ్రీలక్ష్మి

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కొమ్ముగూడెం, నీలాద్రిపురం, కడియద్ద, జగ్గన్నపేట, వెంకట్రామన్నగూడెం, మెట్ట ఉప్పరగూడెం గ్రామాల్లో మిచాంగ్ తుపాను ప్రభావంతో అరటి, దొండ, చిక్కుడు, పందిరి కూరగాయలు 32 ఎకరాల్లో నీట మునిగాయని ప్రాథమిక అంచనాగా మండల ఉద్యాన అధికారిణి శ్రీలక్ష్మి తెలిపారు. బుధవారం ఆయా గ్రామాల్లో పంట సర్వే నిర్వహించారు. ఆమె వెంట రైతులు ఉన్నారు.

నేడు, రేపు ఉచిత యోగా శిక్షణ కార్యక్రమం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని గుణ్ణం ఫంక్షన్ హాల్‌లో గురువారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉచిత అంతర్ముఖ యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్టు శ్రీసత్యసాయి నిత్యయోగా సాధన కేంద్రం వారు ఒక ప్రకటనలో తెలిపారు. భిక్షమయ్య గురూజీ పర్యవేక్షణలో జరుగుతుందన్నారు. అలాగే 8వ తేది ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మహిళా వ్యక్తిత్వ వికాస యోగ శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. ఔత్సాహికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు బడుగు చంద్రశేఖర్ 9515925677, కరిబండి రామకృష్ణ 9440528855లను సంప్రదించాలని సూచించారు.